## తమిళనాడు దంపతులకు శిశువు దత్తత



శెనార్తి మీడియా, కరీంనగర్:

కరీంనగర్ శిశు గృహంలో ఉన్న మూడు నెలల పాపను సోమవారం తమిళనాడుకు చెందిన దంపతులకు చట్టబద్ధంగా దత్తత ఇచ్చారు. జిల్లా సంక్షేమ అధికారి ఎం. సరస్వతి ఆధ్వర్యంలో దత్తత ప్రక్రియ పూర్తయింది. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారి ఎం. సరస్వతి మాట్లాడుతూ, సంతానం లేని దంపతులు చట్టబద్ధమైన విధానంలోనే దత్తత తీసుకోవాలని సూచించారు. దత్తత ప్రక్రియకు సంబంధించిన పూర్తి వివరాల కోసం జిల్లా పరిషత్ కార్యాలయంలోని జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయాన్ని సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో శిశు గృహం ఇన్‌చార్జి అపూర్వ, జె. తిరుపతి, సంపత్, మునిగంటి రాజ్‌కుమార్, సాదినేని రమేష్, మహేష్ పాల్గొన్నారు.

# ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కరించాలి



శెనార్తి మీడియా, కరీంనగర్:

ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీవో షర్మిల, డీఆర్ఓ స్వామితో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మొత్తం 212 దరఖాస్తులు అందాయి. వీటిలో అత్యధికంగా కరీంనగర్ ఆర్డీవో కార్యాలయానికి 66, గృహ నిర్మాణ శాఖకు 44 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ప్రజావాణి దరఖాస్తులు, కోర్టు కేసులు అనవసరంగా పెండింగ్‌లో ఉండకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రజలకు త్వరితగతిన సేవలు అందేలా ప్రతి శాఖ బాధ్యతాయుతంగా వ్యవహరించి, ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలని సూచించారు.







## ఎల్‌నినోపై రైతులకు అవగాహన



శెనార్తి మీడియా, శంకరపట్నం:

ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని శంకరపట్నం మండలంలోని ఎరడపల్లి, ధర్మారం, అంబేద్కర్ నగర్, గుడాటిపల్లి గ్రామ సభల్లో రైతులకు ప్రత్యామ్నాయ ఆరుతడి పంటల సాగుపై వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రైతులు అధిక నీటి అవసరం ఉన్న పంటలకు బదులుగా తక్కువ నీటితో సాగు చేయగల ఆరుతడి పంటలను ఎంచుకోవాలని సూచించారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక, సాగు నిర్వహణ, నీటి సంరక్షణ చర్యలపై రైతులకు వివరించారు. ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ నిపుణుల సూచనలు పాటిస్తే నష్టాలను తగ్గించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈఓలు) ఆరతి, సునంద, రాజ్‌కుమార్, కీర్తన పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

శెనార్తి మీడియా, శంకరపట్నం



సైదాపూర్ మండలం ఎక్లాస్‌పూర్ గ్రామానికి చెందిన పల్లెపు మహేష్ (36) రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ఎక్లాస్‌పూర్ నుంచి కేశవపట్నానికి వచ్చి తిరిగి తన కుమారుడితో కలిసి స్వగ్రామానికి వెళ్తుండగా, సోమారం రోడ్డు సమీపంలో అకస్మాత్తుగా ఓ ఆవు రోడ్డుపైకి రావడంతో ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడింది. ఈ ప్రమాదంలో మహేష్ తలకు, కాళ్లకు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. మహేష్ తన కుమారుడు రిత్విక్‌ను హాస్టల్ నుంచి ఇంటికి తీసుకువెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. ప్రమాద విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వెంటనే 108 అత్యవసర సేవలకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది ఈఎంటీ గూడూరు సతీష్ రెడ్డి, పైలట్ మత్తి గోపీకృష్ణ సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రుడికి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం అంబులెన్స్‌లో హుజురాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు చేపట్టారు.

## మాట నిలబెట్టుకున్న మహేష్



శెనార్తి మీడియా, శంకరపట్నం:

శంకరపట్నం మండలం మొలంగూర్ గ్రామానికి చెందిన గాజుల మహేష్ గ్రామ సర్పంచ్ ఎన్నికల్లో స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి చెందినప్పటికీ, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ మరోసారి ఉదారత చాటుకున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఎవరైనా మరణిస్తే వారి కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సాయం, ఆడ శిశువు జన్మిస్తే రూ.5 వేల నగదు అందజేస్తానని ఆయన ప్రకటించారు. ఇటీవల గ్రామానికి చెందిన కొండ్ర ఎల్లయ్య మృతి చెందడంతో ఆదివారం ఆయన కుటుంబాన్ని పరామర్శించిన గాజుల మహేష్, తన హామీ మేరకు రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఇప్పటివరకు ఈ హామీ కింద ఏడోసారి ఆర్థిక సహాయం అందించడం విశేషం. అలాగే గ్రామ ఉపసర్పంచ్ దండు రాజేష్ బాధిత కుటుంబానికి 25 కిలోల బియ్యం అందజేసి అండగా నిలిచారు. ఎన్నికల్లో ఓడిపోయినప్పటికీ ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న గాజుల మహేష్‌ను గ్రామస్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యార్థుల సమస్యలు పరిష్కరిస్తాం

- వెలిచాల సర్పంచ్ వీర్ల నర్సింగరావు

శెనార్తి మీడియా రామడుగు :




0-18 సంవత్సరాల పిల్లల సమస్యలను గ్రామ పంచాయతీ పాలకవర్గం తరపున తాము పరిష్కరిస్తామని సర్పంచ్ వీర్ల నర్సింగరావు అన్నారు. వార్షిక ప్రణాళికలో భాగంగా రామడుగు మండలం వెలిచాల జీపీ కార్యాలయంలో సరస్వతి ఇంగ్లిష్ మీడియం, జడ్పీహెచ్ఎస్, ప్రైమరీ స్కూల్ పిల్లలతో సోమవారం గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తమ సమస్యలను సర్పంచ్కు వివరించారు. ప్రతి సమస్యను తమ సమస్యగా భావించి వాటి వీలైనంత త్వరగా పరిష్కరిస్తానన్నారు. గ్రామాన్ని అన్నిరంగాల్లో ముందుంచడానికి తమవంతు ప్రయత్నం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎల్లమ్మల వసంత, వార్డు మెంబర్లు, పంచాయతీ కార్యదర్శి సత్తయ్య, ఆయా పాఠశాలల హెచ్ఎంలు, 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు విజన్ హైస్కూల్ విద్యార్థుల ఎంపిక




శెనార్తిమీడియా, కరీంనగర్ :

డిస్ట్రిక్ట్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రీజియన్ స్పోర్ట్స్ స్కూల్లో జరిగిన అథ్లెటిక్స్ పోటీల్లో కొత్తపల్లి మండలం రేకుర్తి విజన్ హైస్కూల్ విద్యార్థులు వివిధ విభాగాల్లో బంగారు , వెండి , కాంస్య పతకాలు సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు స్కూల్ కరస్పాండెంట్ సిరిపురం ప్రసాద్ తెలిపారు. అండర్ -8 విభాగంలో ఎం.శృతిక 200, 60 మీటర్స్లో బంగారు, కాంస్య పతకం, జి.అయాన్ లాంగ్ జంప్ లో బంగారు పతకం సాధించారు. అండర్- 10 విభాగంలో బి.శివాన్స్ 200, 60 మీటర్స్లో వెండి పతకం, అండర్- 12 విభాగంలో జి.సాయి తేజ షాట్పుట్లో కాంస్య పతకం, ఆర్.అద్వైతరెడ్డి 400 మీటర్స్లో కాంస్య పథకం గెలుపొందినట్లు పేర్కొన్నారు. 7 , 8 తేదీల్లో హనుమకొండలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు వీరు ఎంపికయ్యారని చెప్పారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ సందవేణి వెంకట్, ఇంచార్జ్ ప్రతిభ భారతి, ఫిజికల్ డైరెక్టర్స్ శివసాయి, వరుణ్ కుమార్, టీచర్స్ పాల్గొన్నారు.

## వ్యవసాయ మోటార్ చోరీ

శెనార్తి మీడియా, శంకరపట్నం:



శంకరపట్నం మండలం అరకండ్ల గ్రామ శివారులో వ్యవసాయ మోటార్ చోరీకి గురైంది. కన్నాపూర్ గ్రామానికి చెందిన రైతు వంగల రవీందర్ రెడ్డికి అరకండ్ల శివారులో వ్యవసాయ భూమి ఉంది. ఆదివారం రాత్రి గుర్తుతెలియని దుండగులు వ్యవసాయ మోటార్‌తో పాటు పైపులు, విద్యుత్ వైర్లను అపహరించినట్లు సమాచారం. సోమవారం తెల్లవారుజామున పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లిన రైతు చోరీ జరిగిన విషయాన్ని గుర్తించాడు. ఈ ఘటనపై బాధిత రైతు కేశవపట్నం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం.

## పోలీసుల అదుపులో దొంగలు..

- కాచాపూర్‌లో కలకలం



శెనార్తి మీడియా, శంకరపట్నం:

శంకరపట్నం మండలం కాచాపూర్ గ్రామంలో ఆదివారం రాత్రి దొంగల కలకలం చోటుచేసుకుంది. గ్రామంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ముగ్గురిని గ్రామస్తులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. అదే సమయంలో గ్రామంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు అక్కడికి చేరుకోగా, పోలీసు వాహనం సైరన్ వినగానే ముగ్గురు అనుమానితులు ఓ ఇంటి పక్కకు పరుగెత్తి తప్పించుకునేందుకు ప్రయత్నించారు. దీనిని గమనించిన పోలీసులు గ్రామస్తుల సహకారంతో వారిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ముగ్గురిని శంకరపట్నం పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారణ చేపట్టారు. వారు గ్రామంలో ఎందుకు తిరుగుతున్నారు, దొంగతనాలకు పాల్పడే ఉద్దేశంతో వచ్చారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## వార్డు సభ్యుల ఫోరం మండల అధ్యక్షుడిగా సతీష్



శెనార్తి మీడియా, బెజ్జంకి:

వార్డు సభ్యుల ఫోరం బెజ్జంకి మండల అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన ఎలిగే సతీష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు బొర్ర సురేష్ కుమార్ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బొర్ర సురేష్ కుమార్ మాట్లాడుతూ, మండలంలోని వార్డు సభ్యుల సమస్యల పరిష్కారానికి అందరినీ ఏకం చేసి సమష్టిగా పోరాటం చేయాలని సూచించారు. అనంతరం నూతన మండల అధ్యక్షుడు ఎలిగే సతీష్‌ను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుల ఫోరం రాష్ట్ర జాయింట్ సెక్రటరీ బోనగిరి మహేష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు లింగాల శ్రీనివాస్, బెజ్జంకి, ముత్తన్నపేట, బెజ్జంకి క్రాసింగ్, లక్ష్మీపూర్ గ్రామాల వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# తల్లిపాలపై విస్తృత అవగాహన కల్పించాలి




శెనార్తి మీడియా, కరీంనగర్:

తల్లిపాల వారోత్సవాల సందర్భంగా తల్లిపాల ప్రాముఖ్యతపై గ్రామస్థాయి వరకు విస్తృత అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. ఈ నెల 7 వరకు నిర్వహించనున్న తల్లిపాల వారోత్సవాల పోస్టర్‌ను అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, శ్రీనివాస్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు, వారి కుటుంబ సభ్యులకు తల్లిపాల అవసరాన్ని వివరించాలని సూచించారు. బిడ్డ పుట్టిన గంటలోపే ముర్రుపాలు పట్టించాలని, ముర్రుపాలలో ఉండే రోగనిరోధక శక్తి శిశువు ఆరోగ్యవంతంగా ఎదగడానికి దోహదపడుతుందని తెలిపారు. మహిళా, శిశు సంక్షేమ శాఖ సిబ్బంది ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులను సందర్శించి గర్భిణీలు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతపై కౌన్సిలింగ్ నిర్వహించాలని సూచించారు. పుట్టినప్పటి నుంచి ఆరు నెలల వరకు శిశువుకు తప్పనిసరిగా తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, అనంతరం రెండు సంవత్సరాల వరకు తల్లిపాలను కొనసాగించేలా అవగాహన కల్పించాలని తెలిపారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు, గ్రామ ప్రజాప్రతినిధుల సహకారంతో ప్రత్యేక అవగాహన సమావేశాలు నిర్వహించి తల్లిపాల ప్రాముఖ్యతను ప్రతి కుటుంబానికి చేరవేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, ఐసీడీఎస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామ కార్యదర్శిపై కలెక్టర్‌కు ఫిర్యాదు

శెనార్తి మీడియా, కేశవపట్నం:



శంకరపట్నం మండలం కేశవపట్నం గ్రామపంచాయతీ కార్యదర్శిపై గ్రామానికి చెందిన అన్నారపు తిరుపతి ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామసభ తీర్మానం లేకుండానే జనరల్ ఫండ్, 15వ ఆర్థిక సంఘం నిధులను విడుదల చేసి, తాగునీటి సరఫరా మోటార్ల నిర్వహణ పేరుతో లక్షల రూపాయల బిల్లులు చెల్లించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అలాగే సంబంధిత దస్తావేజులు లేకుండానే ఇంటి నిర్మాణ అనుమతులు మంజూరు చేశారని, గ్రామ పెద్ద చెరువులో మట్టి తవ్వకాల విషయంలో కూడా లక్షల రూపాయల అవకతవకలు జరిగాయని ఆరోపించారు. ఈ వ్యవహారాలపై గ్రామ ప్రజల సమక్షంలో సమగ్ర విచారణ నిర్వహించి, బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు.

